# అ ఆ!

ఆ పేటలో కొన్ని గుడిసెలు అప్పటికే గంజి తాగి గుర్రు పెట్టి నిద్రపోతుంటే, మరికొన్ని గుడిసెలు మందు ఎక్కువైన మూర్ఛరోగుల్లా మూలుగుతున్నాయి. ఆ గుడిసెల చివర గుడిసెలో గుడ్డి లాంతరు వెలుగుతూంది...

ఆ లాంతరు వెలుగులో అమ్మ పెట్టిన అన్నం సత్తు గిన్నెలో తిని, చేయి కడుకున్నాడు చంద్రం. లేచి లాంతరును గూట్లో పెట్టబోతుంటే బయట గాలి గుడిసెలోకి తోసుకొచ్చింది. ఒకవైపు అద్దం లేని దీపం, విలవిలలాడుతూ ఆరిపోయింది. భయంతో ఆరిపోయిన లాంతరు అక్కడే వదిలేసి గుడిసె చూరుకింద కొచ్చాడు చంద్రం. 'అమ్మా'! అని పిలిచాడు. అమ్మ అసిరమ్మ పలకలేదు. చంద్రానికి భయం ఎక్కువయింది...

బయట చీకటి చిక్కగా ఉంది. దూరంగా వీధి చివర రెండు కుక్కలు రెచ్చిపోయి అరుస్తున్నాయి. చంద్రం చీకట్లో తరుముకుంటూ వాకిలి ముందు వేప చెట్టు దగ్గరకొచ్చాడు. చెట్టు కింద నులకమంచం కోడు కాలికి తగిలింది. మంచంలో కూర్చుంటూ "అమ్మా"! అంటూ గొంతు పెంచి పిలిచాడు. ఈ సారి అసిరమ్మ పలికింది. అసిరమ్మ వేపచెట్టు పక్కనే తడికెల మధ్య నీళ్లోసుకుంటున్నది.

"ఏరా! వణ్ణం తిన్నావా! తింటె నోరు మూసుకుని మంచంలో పడుకుండిపో!"

అమ్మ కంఠం వినబడటంతో చంద్రానికి కొంత భయం తీరింది. మంచంలో వెల్లకిలా పడుకున్నాడు. అక్కడక్కడా చుక్కలు నిక్కి నిక్కి చూస్తున్నాయి. అసిరమ్మ తడికెల మధ్య నుంచి గుడిసెలో కెళ్లింది.

"ఏరా యెదవ సచ్చినోడా! మళ్లీ లాంత రార్పేసినావేటి? నా బతుక్కి నువ్వెక్కడ దాపురించావురా ముదనష్టపోడా!" అసిరమ్మ దీపం వెలిగించింది.'

వేపచెట్టు కింద పడుకున్న చంద్రానికి చల్లటి గాలి అమ్మ తిట్లన్నీ మోసుకొస్తూ 'నోరు మూసుకుని పడుకో' అంది. 'ఈ రోజైనా అమ్మపక్కలో పడుకుంటే ఎంచక్కా నిద్రపోవచ్చు... అమ్మ పక్కన పడుకుంటుందో, లేదో!" అనుకున్నాడు. చంద్రం.

"అసిరీ!" పదునైన గొంతు ఆ చీకట్లో గుర గురలాడింది...

అదురుపాటుతో లేచాడు 'చంద్రం. ఎదురుగా చీకట్లో తెల్లని బట్టలో పొడవైన ఆకారం, నోట్లో చుట్ట. చిట్టచివర మండుతూన్న నిప్పు కణిక...

అసిరమ్మ ఒక్క ఉదుటున గుడిసెలోంచి బయటికి వచ్చింది. గొంతు తగ్గించి "రండి! రండి!! అంటూ ఆనందం నిండిన స్వరంతో గుడిసెలోకి ఆహ్వానించింది. ఆ వ్యక్తి అసిరమ్మను అనుసరించాడు. చంద్రానికి ఏడుపొచ్చింది. అమ్మ మీద చెప్పలేని కోపం వచ్చింది. ఆ వచ్చిన వ్యక్తిని కసితీరా గట్టిగా కొట్టాలనిపించింది. అమ్మ నవ్వులు

వినబడుతున్నాయి.

"ఒరేయ్" సింద్రిగా! పడుకుండిపో, భయం నేదులే!!

'ఉహు! నాకు భయం వేస్తంది. నువ్వొచ్చి నా పక్కలోనే పడుకో అణ్ణి పంపేయ్' అని గట్టిగా అరవాలనుకున్నాడు చంద్రం. కాని అరవలేకపోయాడు. అంతలో అసిరమ్మ గుడిసె తలుపు మూసింది. 'అమ్మ రోజూ ఇంతే' అనుకుంటూ, అసహనంగా మంచంలో దొర్లుతూ ఎప్పుడో నిద్రలోకి జారిపోయాడు చంద్రం. ఉదయానికి కళ్ళ కింద చారికలు, ఆ పసి హృదయంలో సుళ్లు తిరిగిన బాధకు గుర్తులుగా కనిపించాయి. ఆ పసి హృదయం వయస్సు అయిదేళ్లు. ఆ అమ్మ వయస్సు పాతికేళ్లు.

అసిరమ్మ తన కొడుకు చంద్రానికి బొత్తాములేని, నిక్కరు చిరుగులు పడినా కుట్టని చొక్కా తొడిగి గుడిసె నుండి బరబరా లాక్కొచ్చింది...

"అమ్మా! నాకు కొత్తబట్టలు కావాలే" చంద్రం ఏడుపుకు శ్రుతి చూసుకుంటూ, చిందులు తొక్కుతూ అడిగాడు.

"చీ! దరిద్రపు కొట్టెదెవా! నీ బతుక్కి కొత్త బట్టలొకటి తక్కువచ్చినాయేటి? నిన్ను కడుపులో పెట్టి, నన్ను నట్టేట్లో ముంచి పారిపోనాడే ఆ దగుల్బాజీవోడు! ఆ యెదవొచ్చినప్పుడు కొంటాన్లే. పద!" అసిరమ్మ కోపంతో కేక వేసి కొట్టినంత పని చేసింది.

చంద్రం ఏడుపు నాపుకున్నాడు. ఒక చేత్తో ముక్కును తుడుచుకుంటూ జారిపోతున్న నిక్కరు పైకి లాక్కుని, అదే చేత్తో జారిపోతున్న నిక్కరు పైకి లాక్కుని, రెండో చేతిలో పలకా బలపంతో తల్లి కూడా నడుస్తున్నాడు. చంద్రం ఐదు రోజులనుంచి తల్లి బలవంతం మీద తాటాకుల బడికెళుతున్నాడు.

ఎండ చిరచిర లాడుతోంది. రోడ్డంతా కంకరమట్టి. చంద్రం కాళ్లకు ఒత్తుగా అంటుకుంటుంది. ఎదురుగా నీళ్ల మోసే నరసమ్మ తన కూతురుని చంక నెత్తుకుని బళ్లోకి తీసుకెళుతూంది. రావన్న తాత తన మనవడ్ని భుజం మీద ఎత్తుకున్నాడు. తనని ఎత్తుకోవడం కాదు కదా, రెక్క పట్టుకుని విసురుగా లాక్కెళ్లడం, విసుక్కోవడం చూసి చంద్రానికి తల్లి మీద చాలా కోపంగా ఉంది. రోడ్డు వార పడుకున్న తల్లి కుక్కపై కలియబడి అయిదారు పిల్లలు పాల కోసం కుమ్ములాడుతున్నాయి. కుక్కపిల్లల్ని చూస్తూ చంద్రం తల్లి కూడా బడి దగ్గరకొచ్చాడు. బడి దగ్గర గానుగచెట్టు కింద ముసలమ్మ ఒక గోనెపట్టా పరుచుకుని ఉడకపెట్టిన దుంపలు, చేగోడీలు, జంతికలు పోగులుగా పెట్టి అమ్ముతూంది. తల్లీ, కొడుకు లిద్దరూ బడిలోకి అడుగుపెట్టారు.

"బాబు అప్పల్నాయుడుగోరూ! కూసింత బయం సెప్పి నాలుగక్షర ముక్కలొచ్చేలా సేయండి. బళ్లో కెళ్లమంటే తెగ నీల్గిపోతున్నాడు దరిద్రపుగొట్టెదవ!" అసిరమ్మ చంద్రాన్ని, అప్పల్నాయుడు మేస్టారుకి అప్పగించింది...

'అమ్మకు తనని తిట్టడమే పని, కొట్టడమే అలవాటు' అనుకున్నాడు చంద్రం! అసిరమ్మ వైపు చూస్తూ.

"అలాగే లేవే అసిరి! నువ్వంతగా చెప్పాలా యేటి? ఒరేయ్ చంద్రం! అలా కూర్చోరా. ఒసే అసిరి! మధ్యాహ్నం మీ అమ్మగారి కోసారి కనిపించు. ఆవకాయకి కారం కొట్టాలి."

"అలాగే, బాబూ!" అసిరమ్మ కదిలింది.

'అమ్మని అయిదు పైసలడిగితేనో! అయిస్ ఫ్రూట్ కొనుక్కోవచ్చు.

'అమ్మా! ఉహు! మాస్టారు కొడతారేమో.'

చంద్రం వెళ్లిపోతూన్న అమ్మ వైపు తదేకంగా చూస్తూ తటపటాయించాడు. అసిరమ్మ వెళ్లిపోయింది.

అది తాటాకుల బడి. అప్పల్నాయుడు మాస్టారు గళ్ల చొక్కా పొడుగు షరాయి తొడుక్కున్నాడు. దళసరి కళ్లద్దాలతో బావురు పిల్లిలా, బెత్తాన్నాడిస్తూ చంద్రం దగ్గరకొచ్చారు.

"ఒరేయ్ నీ పలకేదిరా?" చంద్రం పలకా, బలపం మాస్టారు చేతికిచ్చాడు. మాస్టారు పలక మీద 'అ ఆ' రాశారు.

"ఈ పలక పుల్ల గట్టిగా పట్టుకో"

చంద్రం పలక పుల్ల గట్టిగా పట్టుకున్నాడు. మాస్టారు చంద్రం పక్కనే కూర్చొని 'అ ఆ' లను దిద్దటం చూపించారు.

అ, ఆ లను దీర్ఘంతీస్తూ ఎలా చదవాలో చెప్పి చంద్రంతో అనిపించారు.

బడి విడిచి పెట్టేవరకూ అలాగే దిద్దమని బెదిరించి, బెత్తంతో కుర్చీ దగ్గరకెళ్లిపోయాడు. చంద్రం అక్షరాలు దిద్దుతున్నాడు. 'అ ఆ' అంటూ చదువుతూ దీర్ఘాలు తీస్తున్నాడు. కొంతసేపు దిద్దేసరికి అక్షరాలు లావుగా, బండగా తయారయ్యాయి. చేతి వేళ్లు కొద్దిగా నొప్పిగా ఉన్నట్లనిపించాయి. మరలా 'అ'ని దిద్దుతూంటే-చంద్రానికి అమ్మ రూపం మనసులో మెదిలింది. అమ్మ మీద కోపంతో 'అ' ని దిద్దటం మానేశాడు.

అసిరమ్మ పొద్దున్నే లేవగానే ఎవరింటికో కంగారుగా పనిలోకి పోతుంది. ఒక గంట తరవాత రెండిళ్లలో పని పూర్తి చేసుకొని వచ్చి, నిద్రపోతున్న చంద్రాన్ని తిట్లతో లేపుతుంది. ముఖం కడుక్కున్న తరువాత సత్తుగిన్నిలో గంజి పోసి తాగమంటుంది. తాగకపోతే నెత్తి మీద గట్టిగా మొట్టి, పెద్దనోరు పెట్టి తిడుతుంది. చంద్రానికి పాపాయమ్మ హోటల్లో ఇడ్లి తినాలని కోరిక. ఎన్నిసార్లు తల్లి దగ్గర కోరిక వెలిబుచ్చినా అది తీరలేదు. పోనీ, కావల్సిందల్లా తండ్రి నడుగుదామంటే చంద్రానికి తండ్రి ఎలా ఉంటాడో తెలియదు. ఎక్కడున్నాడో అంతకంటే తెలియదు.

నాన్న ఎక్కడికో అమ్మ నొదిలి వెళ్లిపోయాడట. అమ్మ అప్పుడప్పుడు ఏడుస్తుంది.

అమ్మ ఏడిస్తే అమ్మను పట్టుకుని తనకీ ఏడవాలనిపిస్తుంది. అమ్మ తనను దగ్గరికే రానివ్వదు. అసలెప్పుడూ రాత్రిళ్లు అమ్మ దగ్గరే పడుకోవాలనుకున్నా, తన దగ్గర అమ్మ ఎప్పుడూ పడుకోదు. అతనెవరో రాత్రిళ్లు పంచె కట్టుకుని చుట్ట కాలుస్తూ వస్తాడు. అతను రాగానే తనని బయట నులక మంచంలో పడుకోమని చెప్పి నవ్వుతూ తలుపేసుకుంటుంది. ఆయన పక్కనే పడుకోవటం ఏమిటో! తనకు నాన్నలేడట! మరి అతనెవరో! అతన్ని చూస్తే తనకు ఒళ్లు మంట. కుక్కను కొట్టే కర్రతో గట్టిగా తలమీద కొట్టాలన్నంత కోపం అసలు తప్పంతా అమ్మదే! అమ్మ మంచిది కాదు...

అమ్మ గురించి ఆలోచిస్తూ 'అ'ని దిద్దటం మానేసి చంద్రం అయోమయంగా చుట్టూ చూశాడు. చంద్రం పక్క వరసలో ఇద్దరు కుర్రాళ్లు జేబులోని చేగోడీలను, మాస్టారు చూడకుండా పలక అడ్డం పెట్టుకొని తింటున్నారు. నోరూరినా, తిరిగి రెండవ అక్షరం 'ఆ'ని దిద్దుతూ దీర్ఘం తీస్తుంటే, కడుపులో ఆకలిగా ఉన్నట్టనిపించింది. పొద్దున్న అమ్మ గిన్నెలో పోసిన గంజి మాత్రమే తాగాడు.

అసిరమ్మ మధ్యాహ్నం రెండు గంటలకి ఎవరింటి దగ్గర్నుంచో గిన్నెలో అన్నం పెట్టుకొస్తుంది అప్పటివరకూ చంద్రం ఆకలితో నకనకలాడాల్సిందే! చంద్రానికో సందేహం. తనకు ఆకలేస్తే తినడానికేమీ ఉండదు. కొనుక్కోవడానికి డబ్బులుండవు. మిగతా పిల్లలంతా ఎంచక్కా తెల్లటి బట్టలు కట్టుకుంటారు. ఐస్ ఫ్రూట్‌లు, జంతికలు అన్నీ కొనుక్కుంటారు. ఆళ్లందరికి డబ్బులెక్కణ్నించి వస్తాయో? తను అమ్మ నడిగితే డబ్బుల్లేవని ఎందుకో విసుక్కుంటుందో అర్థం కాదు. పాపాయమ్మ దగ్గరికెళితే "ఫో వెధవా!" అంటూ కసిరికొడుతుంది. చంద్రం తల్లి వచ్చేసరికి కుండలో నీళ్లు ముంచుకుని తాగి పడుకోవాల్సిందే.

చంద్రానికి అ, ఆ లు దిద్దాలనిపించటం లేదు. అవి దిద్దుతూంటే అమ్మ గుర్తుకు వస్తూంది. ఆకలి కడుపులో కరకరమంటూంది.

చంద్రం మాస్టారి దగ్గర కెళ్లి, చేతి వేళ్లు నాలుగూ మూసి చిటికిన వేలు చూపించాడు. "ఫో వెధవా! త్వరగా వచ్చేయ్." మాస్టారు కసురుకుంటూ నల్లబల్ల వైపు తిరిగి రాసుకోసాగారు. చంద్రం నెమ్మదిగా తనచోటు దగ్గరకి వచ్చి పలక తీసుకొని దాన్ని చొక్కా లోపల కడుపు మీద దాచి, బయటకి వచ్చేశాడు. గానుగచెట్టు కింద ముసల్దింకా దుంపలు, జంతికలు, చేగోడీలు పోగులు పెట్టి అమ్ముతూంది. గోనె పట్టానిండా ఈగలు జోరుగా ముసురుతున్నాయి.

"మామ్మా! ఒక దుంప పెట్టవా!"

"పైసలు తీస్కురా! లేవూ? పోరా పో...! ఓరి నీ కడుపులో నిప్పెట్టా! దుంపెట్ట లేదని కాల్తో ఇసుకజల్లి లగెత్తుకుపోతావా! రేపొత్తావు గదరా! గుంట నా కొడకా. నీ కాళ్ళిరగ్గొడతా!"

చంద్రం పరిగెడుతున్నాడు. కడుపులో ఆకలిగా ఉంది. అమ్మ ఎవరింటి దగ్గరుందో? ఎక్కడుందో? అనుకుంటూ రోడ్డు మీద కంకరాయిని గట్టిగా తన్నాడు. కాలిగోరు చిట్లి రక్తం

చిమ్మింది. రోడ్డు పక్క మైదానంలో పందిరి కళకళలాడుతుంది. రంగు రంగుల కాగితాల తోరణాలు ఎగురుతున్నాయి. గుంపులు గుంపులుగా గుమికూడిన జనం సందడి. పందిరి మధ్య నిలబడి స్టేజీ మీద మైకులో మాట్లాడుతున్న 'ఖద్దరు టోపీ' వ్యక్తి మాటలు వినబడుతున్నాయి.

"మహా జనులారా! మనం పిల్లల పండుగ జరుపుకుంటున్నాం. ఈ పండుగ సందర్భంలో మేము పిల్లలకి కొన్ని ప్రత్యేకమైన సదుపాయాలు సమకూర్చాలని పథకాలు వేస్తున్నాము. మీకు తెలుసు మనలో మన పరిసరాల్లో ఎంతోమంది పిల్లలు తిండీ, గుడ్డా, తగిన ఆదరణ నోచుకోక అనాథలుగా రోడ్ల మీద బ్రతకటం. అందువల్ల నే చెప్పేదేమిటంటే..."

చంద్రానికి ఆ పందిరిలో కెళ్లి జనం మధ్య కూర్చోవాలనిపించింది. కాని, కడుపులో ఆకలి ఎక్కువయింది. కాలిగోరు తెగ సలుపుతూంది. ఇంకా ముందుకు నడిచాడు చంద్రం. ఎదురుగా కిళ్లీకొట్టు. అరటి పళ్ల గెలలతో రంగుల సీసాలతో సినిమా బొమ్మల్తో అందంగా వుంది. చంద్రం కిళ్లీకొట్టు ముందుకెళ్లి నిలబడ్డాడు. కొంతసేపటికి కొట్లో మనిషి కిందకి దిగాడు. వేలాడగట్టిన అరటి గెలల్ని ఒక్కొక్కటి బల్ల మీద పెట్టి కాయల్ని లెక్కబెట్టసాగాడు. ఆ మనిషి అటువైపు తిరగడం చూసి చంద్రం గబుక్కున ఒక గెలలోని నాలుగు పళ్లు లాగి చేత్తో పట్టుకొని పరుగు లంకించుకున్నాడు. తననెవరో తరుముకు వస్తున్నట్లు భయంతో వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు పరిగెత్తాడు. పరిగెడుతూ, ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆగాడు. తన చేసిన పనికి చంద్రానికి ఎంతో గర్వంగా ఉంది. ఏదో సాధించాననే తృప్తి కలిగింది. ఆనందంగా మెట్లు మీద కూర్చొని నాలుగరటి పళ్లు నెమ్మదిగా తినేశాడు. గుడి దగ్గర కుళాయి తిప్పుకుని మంచినీళ్లు కడుపు నిండా త్రాగాడు. చంద్రానికి ఆకలి తీరింది.

"అయ్యా బాబూ! కళ్లు లేని కబోదిని తండ్రీ! ధర్మం చెయ్యండి బాబు నాయనా!" ఎవరో గుడ్డి ముసలమ్మ కర్ర సాయంతో నడుస్తూ అడుక్కుంటూంది. దారిని పోయేవాళ్లు ఆ ముసలమ్మ డబ్బాలో డబ్బులు వేస్తున్నారు. చంద్రం ఆ ముసలమ్మనే చూస్తూ దగ్గరకెళ్లి కర్ర పట్టుకున్నాడు.

"ఎవరు నాయనా! గుడ్డి ముసలమ్మ అడిగింది.

"నేను మామ్మా! చంద్రాన్ని నేనూ నీతో రానా?"

"నా నాయనే! రా, బాబూ! అంతకంటేనా? నీకు బోల్డు డబ్బులిస్తాను. బువ్వ పెడతాను. తాయిలం కొని పెడతాను. నా దగ్గరే పడుకోబెట్టుకుంటాను."

చంద్రాన్ని ముసలమ్మ దగ్గరగా తీసుకొని ముద్దు పెట్టుకుంది. ఒళ్లంతా నిమిరింది. చంద్రం ఉత్సాహంగా కర్ర పట్టుకుని "మామ్మా! నీ దగ్గరే ఉంటా"నంటూ తాను ముందుకు నడుస్తూ ముసలమ్మను నడిపించసాగాడు. చంద్రానికిప్పుడు అమ్మ అవసరం లేదు. ఆకలి అంతకంటే లేదు. చేతిలోని పలకమీది అక్షరాలు 'అ, ఆ' లు చేత్తో చెరిపేసి పలకను పెంట మీదికి విసిరేశాడు.!

❋ ❋ ❋ ❋ ❋ ❋

(ఆంధ్రప్రభ 16.7.1980)